# కారుచీకటిలో కాంతిపుంజం

"వాళ్ళ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది," నుదుటిమీద చెమట తుడుచుకుంటూ అన్నాడు పరంధామయ్య.

"ఏమంటున్నారేమిటీ!?" చదువు రాని వల్లమ్మ ఆదుర్దాగా అడిగింది.

"ఆఁ" చప్పరించాడు ఆయన. "ఏవంటారూ? ఎప్పుడూ పాడేపాటే! నెలరోజుల్లో ఐదువేలు ఇవ్వకపోతే అమ్మాయిని పుట్టింటికి గెంటేయడం ఖాయంట."

"అమ్మయ్యో! ఇంకేమన్నా వుందా? వున్న కాస్త పరువూ మంటగలవాల్సిందే! ఐనా ఆమాత్రం తెలియొద్దూ మీకు! ఆ కట్నం డబ్బు ఐదువేలూ ఆనాడే వాళ్ళ మొఖాన కొట్టాల్సింది. ఇప్పుడేం చేద్దామండీ!" భయంగా అంది వల్లమ్మ.

"సరేలే! మాటలు చెప్పడం మహా తేలిక! నేనూ అదే ఆలోచిస్తున్నా! నెల రోజుల్లోపల గాదుగదా. ఐదునెలలు గడువిచ్చినా, ఐదువేలు సంపాదించగలమా! వున్నపళాన ఐదువేలెలా తెద్దాం!" ఆయన నిట్టూర్చి ఊరుకున్నాడు.

"అలాఅని అమ్మాయి నూరేళ్ళ జీవితాన్ని మంటగలుపుతారూ! ఏదో ఒక ఆలోచన గబుక్కున చేసేయండి," అంటూ వల్లమ్మ విసురుగా వంటింట్లోకి వెళ్ళింది.

మళ్ళీ ఐదు నిముషాలయ్యాక వచ్చి. "పోనీ.. ఒకపని చేద్దాం," అంది ఆవిడ భర్తముఖంలోకి చూస్తూ.

ఏమిటన్నట్లు చూశాడు పరంధామయ్య.

"తాటిచెట్లంతవాళ్ళు ముగ్గురుకొడుకులున్నారుగదా! ముగ్గురూ మూడువేలివ్వలేరూ."

"నువ్వు చెప్పేది మరీ బాగుంది;" ఆయన సాలోచనగా అన్నాడు. "వాళ్ళ జీతాలు వాళ్ళ సంసారాలకే చాలడంలేదు. ఎంతయితే సరిపోతుంది. ఈ గడ్డు కాలంలో! ఇంక మన కేం పెడతారూ!"

"ఏమన్నా గానిండి, మీకు వెళ్ళి అడగడం నామోషీ అయితే, నే వెళ్ళి సాధించుకొస్తాను," అంది వల్లమ్మ ఛాలెంజి చేస్తున్నట్లు.

---

సి హెచ్. రాజేశ్వరి, 10th class

"పరె... సరే! నామీదికే తిరిగింది! నీ బాణం!"

*    *    *

హఠాత్తుగా గుమ్మంలో కాలుపెట్టిన అత్తగారిని చూసి అచల విపరీతంగా ఆశ్చర్యపోయింది. క్షేమ సమాచారాలయ్యాక కోడలు చేతిలో గరిట అందుకొని అన్నం కలియబెడ్తూ "అబ్బాయి ఆఫీసు కెళ్ళాడా!'' అంది అచలతో.

''అవునుగానీ, మీరెళ్ళి కాసేపు పడుకోండి; ఇప్పుడొచ్చినవారు మీకెందుకు పిల్లలొచ్చాక భోంచేద్దురుగాని," అంటూ అత్తగారి చేతిలో గరిట తీసుకుంది అచల.

*    *    *

అడకుగా వచ్చిన తల్లిని చూసి ఎంతో ఆనందించాడు మహీమ్. ఆఫీసు కెళ్ళేంతవరకూ ఆవిడను అంటిపెట్టుకొని తిరిగాడు. కోడలి అభిమానం, కొడుకు ప్రేమా భరించలేక ఆవిడ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పిల్లలవిషయం సరేసరి! బామ్మొచ్చిందని ఆపూట బడికి పంగనామాలు పెట్టేశారు.

*    *    *

వున్న ఒక్కరోజులోనే గ్రహించింది వల్లమ్మ - మహీమ్ తెచ్చే జీతం వాళ్ళకు సరిగ్గా చాలడం లేదని. ఇంట్లో ఒక్కకూర లేదు. ఒక వెచ్చంలేదు. బియ్యం నిండుకోవస్తున్నాయి. తన కోసం ఆ ఇంటికీ, ఈ ఇంటికీ అప్పుల కోసం పరుగెత్తుతున్నా రని ఆవిడ గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదు.

ఆరోజు ఆదివారం - మహీమ్ ఇంట్లోనే వున్నాడు. మధ్యాన్న సమయం - అప్పుడే భోంచేసి నడుం వాల్చింది వల్లమ్మ. ఒక కునుకుతీసి లేచేసరికి ఏవోమాటలు విన్పిస్తున్నాయి.

"అంత దూరంనించి వచ్చారు. పిండివంట చేద్దామన్నా కనీసం నూనె గూడా లేదాయె. ఎలా!'' అచల కంఠం.


"ఎవరిదగ్గరయినా అప్పు తీసుకోకపోయావ్?" మహీమ అంటున్నాడు.

''ఆ! ఎవరుమాత్రం ఎందాక ఇస్తారు! వాళ్ళకు మాత్రం సంసారాలు లేవూ!"

"కనీసం అమ్మవరకైనా..."

మహీమ్‌ను మాట్లాడనివ్వకుండానే మధ్యలోనే "నేనింక అడగలేను బాబు! నా వల్లగాదు. ఈ రెండోజుల్నించీ వెనుకనుండి విసిరే బాణంలాంటి మాటలూ, మూతివిరుపులూ నేను భరించలేకుండా వున్నాను. ఇంక ఈ రోజు అడిగితే మొఖాన్నే తలుపులేస్తారు." అచల అంటోంది.

వల్లమ్మకు కడుపులో దేవినట్లు అయింది: ఇలా వుంటే వీళ్ళస్థితి, తను ఇంకెలా డబ్బు అడుగుతుంది. ఇంకా నయం, అడిగిందిగాదు. అడిగింతర్వాత ఇవ్వలేకపోయినందుకు బాధ పడ్తారు గూడా. భర్త మాటలు ఆవిడ చెవుల్లో




మ్రోగాయి. 'అవును; వాడు చేసేగుమాస్తా ఉద్యోగంతో భార్యా, భర్తా, ముగ్గురు పిల్లలూ బ్రతకాలి. అందులో బస్తీ! ఎంతయితే చాలుతుంది,' అనుకుంది ఆవిడ మనసులో.

"అమ్మా!" బాధగా అన్నాడు మహీమ్; "మరి రెండురోజు లుండరాదా!"

"కాదురా! అలా వెళ్ళి వాళ్ళను గూడా చూసి రావాలి. అక్కడ మీనాన్న గారు ఏ అవస్థ పడ్తున్నారో ఏమో?" అంది వల్లమ్మ గడప దాటుతూ

రైలెక్కాం తర్వాత తల్లిచేతులు గభాల్న పట్టేసుకుని "అమ్మా! నన్ను క్షమించమ్మా! అంతదూరం నుండి వచ్చావ్. కనీసం రవికగుడ్డయినా పెట్ట లేని అసమర్థుడిని!" అన్నాడు మహీమ్ కన్నీళ్ళు ఆపుకుంటూ.

"ఛీ, అలా అనకు. ప్రేమ హృదయంలోది. దాన్ని ఒక్క రవికగుడ్డతో కొలుస్తావా! నీఅభిమానం చాలుబాబూ!" అంటూ కొడుకు కన్నీళ్ళు తుడిచిం దావిడ. రైలు కదలబోతుండగా పది రూపాయలనోటు కొడుకుచేతిలో వుంచి "పిల్లల కేమన్నా కొనిపెట్టు," అంది, వల్లమ్మ నిట్టూర్చుతూ!

* * *

"ఎప్పు డొచ్చావ్?" ఆఫీస్‌నుంచి వస్తూనే అన్నాడు సచీంద్ర. క్రింద పీటవాల్చుకు కూర్చుంటున్న తల్లినిచూసి "ఇలా కూర్చోమ్మా!" అన్నాడు తన ప్రక్కన చైర్ చూపిస్తూ.

"అబ్బె! నా కలవాటు లేదురా — అలా కుర్చీలమీదకూర్చుని బల్లలమీద, తినటం. అబ్బ, ఏమిటో! కాలం

ఇంతలా మారిపోతూంది. అంటూ, పాడూ ఏమీ లేకుండా పోతున్నాయి."

అత్త అన్నమాటలకు యామిని ముఖం చిట్లించింది; పచీంద్ర కోపంగా చిన్న బుచ్చుకున్నాడు!

వల్లమ్మకు అంతా అసంతృప్తిగా వుంది. 'ఆప్యాయతలో ఏదో వెగటూ, అభిమానంలో ఏదో వెలితి. ఇంట్లో స్వాతంత్ర్యం లేదు. ఎవరికివారు విడిగా బ్రతకటం - ఎప్పుడూ, విందులూ, వినోదాలూ; ఆడా మొగా బేధంలేదు. అయినా తన కెందు కీ సంగతులన్నీ! వచ్చిన పని చూసుకు వెళ్ళిపోతేసరి!' అనుకుంది వల్లమ్మ ఆ రాత్రి పడు కుంటూ,

అర్ధరాత్రి మెలుకువ వచ్చింది... ఆవిడకు. కీచురాళ్ళ గొడవ; ఎముకలు కొరికే చలి. నిద్రపట్టక లేచి కూర్చుంది వల్లమ్మ. ఏవో మాటలు ఆమె చెవుల సోకాయి. "ఇంత అర్ధాంతరంగా ఊడిపడ్డారేం ఆవిడ,' అంటోంది కోడలు. మళ్ళీ - "బావగారి దగ్గరకుకూడా వెళ్ళి వచ్చినట్లున్నారు," అంది.

"డబ్బుకోసం వచ్చినట్లుంది చూస్తే! ఇక్కడ ఎవరూ తేరగా ఆర్జించి పడేయడంలేదు " కొడుకు గొంతు ఖంగు మంది.

కాస్త మొగడూ, పెళ్ళాం విడిగా వుంటేచాలు, కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారు. అందులో కాస్త మంచి స్థితిలో వుంటే మరీ!"

"పెళ్ళయింతర్వాత గూడా అలా పట్టుకు వెళ్ళాడకపోతే, ఎవరిబాధ్యతలు వారికి వదిలిపెడితే ఎంత బాగుణ్ణు!"

"మన జీతాలూ, జీవితాలూ వీళ్ళకి సంతృప్తి పరచడంతోనే సరిపోయేట్లు ఉన్నయ్!"

ఆవిడ తల తిరిగిపోయింది. ఇంక వినలేకపోయింది. ఛీ, తనింక తొందర పడి అడిగిందిగాదు! ఎంత చదువుకొంటే మాత్రం ఇంత అడిరిపాటా! పెళ్ళయినంత మాత్రాన ఇంక తల్లిదండ్రుల బాధ్యత అంతరించి పోవలసినదేనా! కాస్త అభిమానం వున్న మనిషికి చాలు రంపపుకోతలాంటి ఈ మాటలు.

ఇప్పటికి రెండు చోట్లా నిరాశే అయింది. మూడోవాడు మాత్రం ఆదరి స్తాడనా నమ్మకం? కాని అంతలోనే కాదు, ఎన్నటికీ అలాగాదు! ఒకతీగెకు కాసిన దోసకాయల్లోనే తీపీ, చేదూ వుంటాయి- అలాగే నా పిల్లలుగూడా! ఇంక పేడిని తిరిగి ప్రయోజనం లేదు,' అనుకుంది.

తెల్లారింది. రిక్షా ఎక్కబోయిన వల్లమ్మకు యామిని బొట్టుపెట్టి చీరా, రవికా పెట్టబోయింది. వల్లమ్మ చప్పున చేతులు వెనక్కి తీసుకొని "వద్దమ్మా; నా కెందు కివన్నీ! మీ జీవితాలు ఇలా పమ్మల్ని సంతృప్తి పరచడానికే సరిపోతాయి," అంది మాటకు మాట వప్ప

చెప్పేస్తూ! యామిని తెల్లబోయింది. రాత్రి తమ సంభాషణ విన్నదేమో అని సచీంద్ర తల్లిని రిక్షా ఎక్కిస్తూ స్టేషన్‌కెళ్ళడానికి ముఖం చెల్లక "నాకు ముఖ్యమయిన పనివుంది; స్టేషన్‌కి రాలేను! ఊరు చేరగానే తప్పకుండా 'లెటర్' రాయి," అన్నాడు.

మనిషిని డబ్బు ఎంతత్వరగా మార్చేస్తుంది! ప్రేమలూ, బాంధవ్యాలూ అన్నీ తెగతెంపులవుతాయి దానివల్ల. మూడో వాడి దగ్గరా ఇలాగే జరిగితే! ఆవిడ మనసు పీకులోంది. అంతలోనే చీకటిలో చిన్నవెలుగురేఖ! ఎడారిలో ఒయాసిస్సులా తళుక్కుమంది.

పెరటినిండా జామ, మామిడి మొదలైన చెట్లూ, కూరపాదులూ; పాకనిండా ఆవులూ, గేదెలూ; మూడుపూట్లా కమ్మని నెయ్యి, పెరుగూ; ఆవిడకెంతో నచ్చింది ఆ వాతావరణం. తను కోరుకున్నవన్నీ ఇక్కడ పుష్టిగా వున్నాయి. ప్రేమ కురిపించే కోడలూ, ఆప్యాయత సింపే కొడుకూ! ఆమె తను వచ్చిన పని కూడా మర్చిపోయేలా వుంది. వచ్చి రెండురోజులైనా మనసులోమాట బయట పెట్టడానికి అవకాశం చిక్కలేదు. ఇద్దరు కొడుకులదగ్గరా ఆ ప్రసక్తి తేకుండానే జరిగిపోయింది; 'భగవాన్! ఇక్కడైనా డబ్బు లభించేట్లు చెయ్యి; అడగడానికి నాకు ధైర్యసాహసాలు ఇవ్వు.' అనుకుంది ఆ తల్లి.



"ఏదో నాలుగురాళ్ళు సంపాయిద్దామని ఈవూ రొచ్చాను."
"ఏం? రాళ్లు మీవూళ్లో దొరకవా???"

తల్లి లేవకముందే వెళ్ళిపోతాడు శ్రావణ్ పొలానికి. మధ్యాన్నం అన్నం అక్కడికే పంపుతుంది బిందు. సాయంత్రం అలసిపోయి వచ్చిన కొడుకుని విసిగించడం ఆవిడ ఉద్దేశ్యంగాదు. శ్రావణ్‌కే తెలుసు తల్లి ఏదో బలమైన కారణం లేకపోతే రాదని. 'డబ్బుకోసమేమో! ప్రస్తుతానికి తన దగ్గర వెయ్యిరూపాయలున్నాయి! చూద్దాం,' అనుకున్నాడు ఆతను.

అత్తకూ, భర్తకూ పక్కలు వేసి వంటిల్లు _ బాగు చేసుకుంటోంది బిందు. అదే సమయమనిపించింది వల్లమ్మకు. నెమ్మదిగా తన ప్రసక్తికి భరతవాక్యం పలికింది. "ఆషకు ఇవ్వాల్సిన కట్నం డబ్బు ఇంకా ఇవ్వలేదురా! ఇప్పు

దేమో వాళ్లు మొండికెత్తి కూర్చున్నారు. ఏంచేయాలో తోచడంలేదు. ఉన్నపళాన ఐదువేలు ఎక్కడ పుట్టించడం?"

"ఏం చేద్దా మనుకుంటున్నారు?" శ్రావణ్ అర్థం అయినా, పైకి అడిగాడు. మళ్ళీ, "పోనీ, అన్నయ్యలదగ్గర కెళ్ళి రాకపోయావా?" అన్నాడు.

"ఆ!" నిష్ఠూరంగా అంది; "వెళ్లాను. ఏం లాభం – సిరివున్నచోట ప్రేమలేదు; ప్రేమవున్నచోట సిరిలేదు!" అంటూ జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పింది. శ్రావణ్ బాధపడ్డాడు.

"ను వ్వేలాగయినా సర్దావంటే..."

"ను వ్వింతగా బ్రతిమాలాలాఅమ్మా! నా చేతనయిన సాయం నేనూ చేస్తాను." శ్రావణ్ అని వురుకున్నాడు.

ఆవిడకు ప్రాణం లేచివచ్చినంత పనయింది. అంతలోనే ఆమెకు ఎదురుగా తన కూతురు కుమిలిపోతూ ఇంట్లో తిరుగుతున్నట్లూ, అమ్మలక్కలు సూటీ పోటీ మాటలూ కళ్ళకు కట్టినట్లు కని పించ సాగాయి.

* * *

అందముగా విచ్చుకున్న మందార పూలు చెట్టు నిండుగా పిల్లల తల్లిలా వున్నాయి. పొన్నంగిపూలు వత్తుగా రాలి మెత్తగా పడుకున్నాయి. పడతుల చేతి చల్ల చిలుకు శబ్దాలతో గాజులమోతలు వింతగా విన్పిస్తున్నాయి. హరిదాసు వీణ సన్నగా పలుకుతుంటే, ఆయన పాట ఆ నిశ్శబ్దంలో ప్రతిధ్వనిస్తోంది. వల్లమ్మ లేచి కొడుకు పక్క ఖాళీగా వుండటం చూచి 'అప్పుడే వెళ్ళిపోయాడే' అను కుంటూ పళ్ళపొడి తీసుకుని పెరటిలోకి నడవబోయింది.

వంటింట్లోనుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. "ఆవిడ ఎంతో ఆశతో ఇంతదూరం వచ్చింది. అది తీర్చే బాధ్యత కొడుకులకు లేదా! ఈ కాస్త అవుసరం తీర్చలేకపోయాక కొడుకై పుట్టడం దేనికి?" బిందు అంటోంది.

"అవును, నువ్వన్నది నిజమే. కానీ ఐదు వేలు ఈక్షణంలో ఎక్కడతేనూ!" శ్రావణ్ అంటున్నాడు.

"ఏమైనా గానీండి. ఆవిడ వెళ్ళి పోవాలని తొందర పడ్తున్నారు. అంతగా ఎక్కడా దొరకకపోతే, నా నగలు ప్రస్తుతానికి అమ్మేయండి. అవుసరానికి గాకపోతే అని ఎందు కేడవనా!"

"వద్దు, వద్దు," అని పెద్దగా అరవా లనిపించింది వల్లమ్మకు. కానీ నోరు పెగల్లేదు. చేతిలోని పండ్లపొడి అలాగే క్రిందికి జారిపోయింది.

* * *

"ఆయన వచ్చేదాకా వుండండి అత్తయ్యా! డబ్బుకోసం వెళ్ళాడు,

తప్పక తెస్తారు. వచ్చే వేళ్ళవుతోంది గూడా!" ఆవిడ ప్రయాణానికి సిద్ధంగా వుండడం చూసి బిందు అన్నది.

"కాదులే తల్లీ! వీళ్ళను కని, రక్త మాంసాలు ధారవోసి, యింతవాళ్ళను చేశాను. నా కెంతో గర్వంగా వుంది." వస్తున్న కన్నీళ్ళు ఆపుకోడానికి ప్రయత్నము చేయకుండానే అంది వల్లమ్మ.

బిందుకు నోట మాట రాలేదు!

"అమ్మా!" అన్న కేక ఆమె మెదడులో ప్రతిధ్వనించింది. కన్నీళ్ళతో మెరుస్తున్న కళ్ళను ఎత్తిచూసింది. శ్రావణ్ పరిగెత్తుకుంటూ వచ్చి తను తెచ్చిన మూటల్ని బండిలో పడేసి, తల్లి దగ్గరకొచ్చాడు. "ఇదిగోనమ్మా! డబ్బు!" అంటూ కట్టను ఆమె చేతిలో పెట్టాడు. వల్లమ్మ ఒక్కసారిగా ఆనందంతో మునిగిపోయింది. శ్రావణ్ ఏమిటేమిటో వాగుతున్నాడు.

"అమ్మా! ఆ గోతంలో పెసలు ఉన్నాయి. వెళ్ళగానే మరపట్టించు. లేకపోతే పురుగు పడతాయి. ఇవుగో; ఈ సంచిలో దోసపళ్ళున్నాయి. నాన్న గారికి దోసావకాయంటే ఇష్టంగదూ!" అంటూ, తల్లి తనమాటలు వినడం లేదని గ్రహించి "ఏమి టాలోచిస్తున్నావ్" అని అడిగాడు.

"అది సరేగానీ, నీ కీ డబ్బు ఎలా వచ్చింది? బిందు సొమ్ములు అమ్మేశావా?" అతృతగా అడిగింది.

శ్రావణ్ నవ్వాడు. "అమ్మలేదు! దక్షిణాన వున్న దోసతోట అమ్మేశాను."

ఆమె తల ఒక్కసారిగా తిరిగింది. "తాత తండ్రులనుండి తరతరాలుగా వస్తున్న తోట అమ్మేశావా!" ఆవిడ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. తన కన్నాళ్ళు చీకటిలో కనుపించిన కాంతిరేఖ ఇదేనా! ప్రతిసంవత్సరము, ఎంత ఆదాయము వచ్చేతోట!

"అమ్మా! క్షమించు. తప్పనిసరిగా అమ్మాల్సొచ్చింది" శ్రావణ్ బాధగా అన్నాడు.

"లేదు బాబూ! నిన్ను కన్నందుకు నా కెంతో గర్వంగావుంది," వల్లమ్మ కొడుకును కౌగలించుకుంది.

